క్లుప్తంగా

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

కోవెలకుంట్ల: సేంద్రియ ఎరువుల వాడకంపై కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల, ముదిగేడు, ఆకుమల్ల, అల్వకొండ గ్రామాల్లో నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ నాగేంద్ర ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ సాగులో విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం మూలంగా భూసారం కోల్పోవడంతోపాటు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ జీవన ఎరువులు వాడటం అన్ని విధాలా శ్రేయస్కరమన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎస్‌జీఏ 2024 సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, నాయకులు మునిస్వామి, వాహిద్, సుధాకరయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ

డోన్ : ఏపీఎన్‌జీఓస్ క్యాలెండర్‌ను గురువారం తహసీల్దార్ విద్యాసాగర్ ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సంఘం తాలుకా అధ్యక్షుడు షమీఅల్లా, కార్యదర్శి ప్రేంకుమార్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాముడు, ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు అశోక్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఉదయభాస్కర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు క్రిష్ణ, కార్యదర్శి వలి పాల్గొన్నారు.

రైల్వే కోడూరుకు వెళ్లి పింఛన్ అందజేత

డోన్ : పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బలిజ ముగ్గు పార్వతికి కుమారుడు ఉన్నాడు. పార్వతి భర్త చనిపోయిన తర్వాత ఆమె వద్ద ఉన్న డబ్బుతో పాటు ఇంటిని కూడా విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. అనంతరం ఆమెను రైల్వే కోడూరులోని ఆదరణ వృద్ధాశ్రమంలో వదిలివచ్చారు. మూడు నెలలుగా ఆమెవైపు కన్నెత్తి కూడా చూడలేదు. మున్సిపల్ కౌన్సిలర్ మేకల విమల, మాజీ కౌన్సిలర్ మేకల రాజు సూచన మేరకు వలంటీర్ చంద్రశేఖర్ రైల్వే కోడూరుకు వెళ్లి లబ్ధిదారురాలు పార్వతికి పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్ సేవలను ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు.

బెల్లం ఊట ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని పిక్కళ్లపల్లి తండా గ్రామ సమీప నాటుసారా తయారీ జరుగుతుందన్న సమాచారం మేరకు గురువారం సెబ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేసి, 900 లీటర్ల బెల్లంఊటను పారబోశారు. అలాగే 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు దౌలత్‌ఖాన్ తెలిపారు.

ముగ్గుల పోటీలు

బేతంచెర్ల: సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ముచ్చటగొలిపాయి. స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఈ పోటీలకు ఆయా కాలనీల నుండి పెద్ద ఎత్తున్న మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. మాజీ రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్లు సముద్రాల మద్దిలేటిస్వామి, గుండా గోపాలు, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా డోన్ ఇన్నవిల్ క్లబ్ సభ్యులు రాజా సుజాత, శాలినీ, రాజకుమారి, విజయలక్ష్మి, లక్ష్మి రేణుఖ వ్యవహరించారు. విజేతలకు బహుమతు లు అందజేశారు.

వడ్డె ఓబన్న జయంతి

బేతంచెర్ల: స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని గురువారం వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంక సుబ్బరాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, నాగేష, మురళీ, రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబన్న త్యాగాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

అవుకు: రామాపురంలో గురువారం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని నాయకులు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. నాయకులు వడ్డె పుల్లయ్య, రామ్మోహన్, రామాంజి, నాగరాజు, సురేష్, వెంకటరాముడు, రమణ, శ్రీను, మద్దిలేటి, చల్లి, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిలో ఎస్ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఓ కుటుంబానికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ సీఎం జగనన్న పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం నగానపల్లె పట్టణం సచివాలయం-2 పరిధిలోని బేంతచర్ల రోడ్డు, రవికిరణ్‌పబ్లిక్ స్కూల్, ఈశ్వరియ బ్రహ్మకుమారి ఏరియా, ప్రియాదర్శిని వృద్ధాశ్రమం ఏరియాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన పథకాలను లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రేషన్‌కార్డు, పింఛన్, ఇళ్ల మంజూరవ్వాలంటే ఏళ్లతరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఏ సంక్షేమ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేదని, అయినా న్యాయం చేకూరేది కాదన్నారు. వీటిన్నంటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటికి స్వస్తి చెప్పిందన్నారు. అర్హత ఉంటే చాలు... ఎవరి సిఫారుసు అవసరం లేకుండా సంక్షేమ పథకాలు మీ ఇంటి ముంగిటకు వస్తున్నాయని గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ ఖలీల్, సచివాలయ పీఎస్ చంద్రశేఖరరెడ్డి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, డిజిటల్ అసిస్టెంట్ సురేంద్ర, వీఆర్ఓగోపాల్, జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు జగదీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, జస్వంత్ రెడ్డి, సురేష్, జిల్లా మైనార్టీసెల్ సెక్రటరీ హుస్సేన్‌వలి, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు అంబటిరవికుమార్‌రెడ్డి, అనిల్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డిరామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డోన్ డివిజన్ స్థాయిలోని సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నెలకొన్న పరిస్థితులపై డీఎస్పీ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరస్థితులను తెలుసుకోవాలని, శాంతి భద్రతలు అదుపులో ఉండేలా చూడాలని సూచించారు. ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రియతం రెడ్డి, తిమ్మారెడ్డి, ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు శివ శంకర్ నాయక్, రామాంజనేయరెడ్డి, శరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గాన్ని అనుసరించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు

అవుకు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అవుకు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. దేశ సమగ్రత, సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ చేసిన అలుపెరుగని పోరాటాన్ని, సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేయబోతున్నారని, ఈ మేరకు ప్రతి గ్రామంలో అంబేడ్కర్ చిత్ర పటాలకు ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓ అశ్విన్ కుమార్, సచివాలయ సిబ్బంది మనోజ్, రాము పాల్గొన్నారు.

ముస్లింలు ఐక్యత చాటుకోవాలి



బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ముస్లిం పెద్దలు

బనగానపల్లె రూరల్ : ముస్లిం సోదరులు ఐక్యత చాటుకోవాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్ సూచించారు. పట్టణంలోని శ్రీధనలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం సాయంత్రం పీస్ మెసెజ్ పౌండేషన్ వ్యవస్థపకులు బ్రదర్ సీరజ్ ఉర్ రెహ్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ పోస్టర్లను ముస్లిం పెద్దలతో కలిసి అబ్దుల్‌ఖైర్ ఆవిష్కరించారు. స్థానిక కొండపేటలోని తన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అబ్దుల్‌ఖైర్ బహిరంగ సభ వివరాలను తెలిపారు. 'ముస్లింల పురోగతి ఎప్పుడు, ఎలా' అనే అంశంపై ప్రముఖ వ్యాఖ్యాత బ్రదర్ సీరజ్ ఉర్ రెహ్మాన్ ప్రసంగిస్తారన్నారు. ఈ బహిరంగ సభ పార్టీలకు అతీతంగా నిర్వహించడం జరుగుతుందని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కూడాముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరి సోదరులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. వైస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యర్శి అత్తార్ జాహెద్, జిల్లా కార్యదర్శి పెద్దన్న,డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ఎవరెస్టు బాబు, సాదక్, సైకిల్‌షాపు మహాబూబ్ వలి, రోటో, సాధిక్, హైదర్, వలి, సునార్ ఇక్బాల్, జాబీర్‌బీన్, అబ్దుల్లా సయ్యద్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ముదిగేడు ఆర్‌అండ్‌బీ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. అవుకు మండలం శింగనపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి సొంత పనుల నిమత్తం ఆళ్లగడ్డకు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరాడు. సంజామల మండలం ముదిగేడు వైపు నుంచి ఆటో ఎదురుగా వస్తుంది. ఆటో, బైక్ ఢీకొన్నాయి. వెంకటసుబ్బారెడ్డితోపాటు ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన యువకుడు నాగూర్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయడంతో సిబ్బంది క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిప్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: సామాజిక బాధ్యత కింద కంపెనీ చుట్టు పక్కల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు తెలిపారు. గురువారం మండల పరిధిలరి కోటపాడులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులను గ్రామాల అభివృద్ధికి కంపెనీ పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రామ్‌కో అడ్మిన్ హెడ్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్, సర్పంచ్ సుంకమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలి

డోన్ : ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే ఆరోగ్య పరిస్థితులు తెలుస్తాయని డోన్ సబ్‌జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి సూచించారు. డీపీసీయూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డోన్ సబ్‌జైల్‌లోని రిమాండ్ ఖైదీలకు గురువారం హెచ్ఐవీ, టీబీ తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాజన్ రాజీ, స్వాతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

బేతంచెర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు తెలిపారు. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గోరుమానుకొండ గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రజలతో బ్యానర్‌పై సంతకాల సేకరణ చేపట్టారు.

14న ముగ్గుల పోటీలు

సంజామల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14న పేరుసోములలో శ్రీవిద్యా స్కూల్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు పి.చెన్నమ్మ, ఆల్వకొండ మద్దిలేటీ తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ముగ్గుల పోటీలకు రంగులను స్కూల్ యజమాన్యం అందజేస్తుందని, ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలోపు పేర్లు నమోదు చేపుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు చిన్నకొప్పెర్లలో ఆరోగ్య సురక్ష

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామ సచివాయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ప్రజలు హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఎస్ రంగాపురంలో టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలోకి చేరిన 10 కుటుంబాలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రంగాపురంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 10 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి తదితరుల సమక్షంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన పరమేసి నాగన్న, జనార్దన్, రాముడు, పెద్ద పెద్దయ్య, చిన్న పెద్దయ్య, నాగేశ్వరరావు, గుర్రప్ప, బాలరాజు, రాముడు తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామమూర్తి, జయరామయ్య, బాలరంగయ్య, నాగరాజు, బాలాంజి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేయాలి



అధిక కలెక్షన్ సాధించిన కండక్టర్లకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్

కోవెలకుంట్ల: ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలని కోవెలకుంట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపోలో పనిచేస్తున్న టిమ్ డ్రైవర్ ఓబులేసు, కండక్టర్లు ప్రసాద్, నరసరాజు ఈపీకే అధికంగా సాధించడంతో గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. అధిక కలెక్షన్ తెచ్చి మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని, ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివరాం, నరసింహ, గిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డాక్టర్‌కు గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిలో గురువా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపాలయ్యకు గా యాలయ్యాయి. కోవెలకుంట్లలో నివాసం ఉంటు న్న తిరుపాలయ్య విధి నిర్వహణలో భాగంగా ఆళ్లగడ్డకు కారులో వెళ్తుండగా పట్టణ శివారులోని పేరా బిల్డింగ్స్ సమీపంలో అదుపు తప్పింది. కారు పొలంలోకి దూసుకపోవడంతో డాక్టర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఇద్దరిపై కేసు నమోదు

అవుకు: మండల కేంద్రంలోని మార్కెట్ వీధికి చెందిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గోపాల్ తెలిపారు. ఆ వీధిలో గొల్ల పుల్లయ్యకు, ఇతని ఇంటి పక్కనే ఉన్న శంకరయ్య, అతని కుమారుడు మధుకు బాత్‌రూమ్ గోడ విషయంలో గత నెల 22వ తేదీన వాగ్వాదం చేటుచేసుకుంది. దీంతో గొల్ల పుల్లయ్యకు రక్త గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు శంకరయ్య, మధుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అభివృద్ధిలో అగ్రగామిగా డోన్

- విశాలంగా విస్తరించిన ప్రధాన రహదారులు
- ఎల్ఈడీ వెలుగులతో మెరుస్తున్న డోన్ పట్టణం

డోన్: ఒకప్పుడు ఇరుకు సందులు, అరకొర వైద్యం, ఏ మాత్రం మౌలిక వసతులు లేని నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,500 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టింది. విద్య, వైద్య, రవాణ రంగాల్లో ఈ నాలుగున్నరేళ్లలో విశేష అభివృద్ధి జరిగింది. డోన్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచింది. డోన్‌లో పలు ప్రైవేటు, వ్యాపారాలు కూడా ఏర్పాటు అవుతున్నాయి. డోన్, ప్యాపిలి పట్టణాల్లో అద్భుతమైన రుచులు అందించే ఫుడ్‌కోర్టు, బకెట్ బిర్యానీ హోటళ్లను శ్రీనిధి వారు ఏర్పాటు చేశారు. ప్రముఖ విద్యాసంస్థ పోటాన్ ఇన్‌స్టిట్యూట్ నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్ రంగంలో ఉచితంగా శిక్షణ ఇస్తోంది. అత్యాధునిక వైద్య సేవలతో నవ్య ఆసుపత్రి ఆధునిక వైద్యాన్ని రోగులకు అందిస్తోంది. మధ్య తరగతి, పేద ప్రజలకు అందుబాటు ధరల్లో నాగేంద్ర రియల్ ఎస్టేట్ వారు ఒక వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన డోన్ ప్రాంతంలో రవాణా రంగంలో తిరిగాడే వాహనాల టైర్ల కోసం అత్యాధునిక వసతులతో శ్రీరామ్ ఏజెన్సీ వారు జేకే టైర్స్ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణాల్లో 30 అడుగుల రోడ్లన్నీ నేడు 80 అడుగుల డబుల్ రోడ్డు కావడంతో డోన్, ప్యాపిలి, బేతంచెర్లలో అన్ని రకాల విద్య, వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు పలువురు మొగ్గు చూపుతున్నారు.



నాలుగులైన్లుగా విస్తరించిన రహదారి



ఎల్ఈడీ లైట్ల వెలుగులో డోన్ ప్రధాన రహదారి